"మన సంప్రదాయాలన్నిట్లో పెళ్లి భోజనం సంప్రదాయం అంటే నాకు చాలా గౌరవం. పప్పన్నం ఎప్పుడు?-అంటే పెళ్లెప్పుడు చేసుకుంటావు అని అర్థం. మాకు బూరె ముక్క ఎప్పుడు పెట్టిస్తావమ్మా అంటే సిగ్గులమొగ్గలు కాని ఆడపిల్లలు అరుదు. అప్పుచేసి పప్పుకూడు అంటే పెళ్లిచెయ్యడంకోసం అప్పుల్లోపడడం అన్నమాట. ఈ నుడికారాలన్నీ వివాహ వ్యవస్థ అంత పాతవీ అంత చక్కనివీనీ. పెళ్లిలో ధప్పళం అప్పడం ఉంటాయి. ముక్కల పులుసూ వేసిన అప్పడం-సాంబారు కాదు సుమండీ! బూరెలు వడ్డించుకుని వేలితో చిన్న బెజ్జం పెట్టి అందులో నెయ్యి వేసుకుని తినడం ఎంత గొప్ప అనుభవం! పెళ్లి పందిరి వదిలి వెళ్తున్న ఆహ్వానితులని మినపసున్ని, అరిసె, లడ్డు, అటుకులు పొట్లాలు కట్టి ఇచ్చి మరీ పంపిస్తారు మనవాళ్లు!" అలా ఉపన్యాసం మొదలెట్టి "వివాహ భోజనంబు!" అనే (భోజనం లాంటి) పాటలోకి జారిపోయేవాడు సన్యాసిరాజు ఒకోసారి. "పెళ్లిలో ఎవరికి ఏందక్కినా ఆహ్వానితులకి దక్కేది కేవలం భోజనమే కదుటండీ!" అనేవాడు.

మొన్న 'మే' నెల పదో తారీకునాడు సన్యాసిరాజు కూతురికి పెళ్లి జరిగింది. నన్ను ఎలా జ్ఞాపకం పెట్టుకున్నాడో, నా అడ్రస్ ఎలా సంపాదించేడోగాని నాకు కార్డు వచ్చింది. ఈ వూళ్లోనే పెళ్లికదా, ఆదివారమే కదా - అని వెళ్లాను. ఉదయం పదీ యాభైకి ముహూర్తం, ఆ తరువాత విందు! ఓహ్! భోజన ప్రియుడు సన్యాసిరాజు స్వయంగా పెట్టిస్తున్న వివాహ భోజనంబు! అహ హ్హా హ్హా హ్హా...అని నేపథ్య సంగీతంతో సహా వెళ్లాను.

కాని అక్కడ నేను ఆశించిన వేవీ వడ్డించలేదు.ముద్ద కందిపప్పు, బూరెలు, పులిహోర, పెరుగు పచ్చడి, ముక్కల పులుసు, అప్పడం, కందాబచ్చలికూర-ఏవీ వడ్డించలేదు.

"వెజిటబుల్ పలావు"; "కచంబర్"; "వైట్ రైస్" (అన్నం అంటే చిన్నతనం కదా!) బంగాళా దుంపల "కుర్మా", వేరుసెనగ పప్పు పచ్చడి, సాంబారు, తాగడానికి తప్ప అన్నంలో కలుపుకోడానికి పనికిరాని "బటర్‌మిల్కు"-

రోజురోజుకీ పాప్యులర్ అయిపోతూ సంప్రదాయంగా రూపుదిద్దుకుంటున్న ఇది "వివాహ భోజనంబు" కాదు; "వివాద భోజనంబు!" అనిపించింది. ★

# 70. వక్రచక్రం

"**మూ**గమనసులు" 1964లో వచ్చింది. మరీ అంత మరిచిపోగల సినిమా కాదు. అందులో ఒకపాట ఉంది. "గోదారీ గట్టుందీ...." అనే ఎత్తుగడతో. అందులో కొన్ని మాటలు -

ఎన్నెల ఉంది, ఎండ ఉంది, (ఇంకోటేదో ఉంది); పువ్వుంది -

ఏది ఎవరికి ఇవ్వాలో ఇడమరిసే ఆ "ఇది" ఉంది!

ఈ మాటలు ఒక పల్లెటూరి పిల్ల పాత్రద్వారా "సినీకాస్ట్" అయ్యాయి.

మా చక్రధరరావు ఎవర్నయినా మెచ్చుకున్నా తిట్టినా నాకు ఈ పల్లెపిల్ల ఎనాలిసిస్ గుర్తొచ్చి అతని మీద కొంచెం చిరాకు వేసి మరుక్షణంలో సరదాకూడా వేస్తుంది.

ఒకసారి చక్రధరరావూ నేనూ దుర్గాభవన్ అనే పేరుగల ఒక కాఫీ హోటల్‌కి వెళ్లేం. సప్లయర్ మా టేబిల్ దగ్గరికి రాగానే చక్రధరరావు "ఇడ్లీ" అని రెండు వేళ్లు చూపించి నన్నూ తననీ మార్చి మార్చి చూపించి రెండు ప్లేట్లు తెమ్మని కూడా నిర్ద్వంద్వంగా చెప్పేడు.

"చట్నీయా; సాంబారా; సార్?"

"సాంబారే."

నేను అడ్డుపడ్డాను. "చక్రం; ఇక్కడ సాంబారు అంత బావుండదు" అని గొణిగి, "చెట్నీతోనే తీసుకురా. సాంబారొద్దు" అని సప్లయర్‌కి చెప్పేను.

వాడు వెళ్లనిచ్చి "ఇక్కడ సాంబారు బావుండదన్నావా?" అన్నాడు చక్రధరరావు.

"అన్నాను."

"నీకెలా తెలుసు?"

తెలుసు.

★★★

కొన్నాళ్ల కిందట, మా ఇంటికి; మధ్యాహ్నం భోజనాలయిన కాసేపటికి, అనుకోకుండా ముగ్గురు గెస్టులు వచ్చేరు. అనుకోకుండా వచ్చే గెస్టులని "అభ్యాగతులు" అంటారట.

"అభ్యాగతిః స్వయం పిడుగుః" అని ఎవరో సూత్రీకరించినట్టు జ్ఞాపకం.

అంతట నేను; ఆ గెస్టులను ముందు గదిలో కూర్చోబెట్టి వాళ్ల ఎదుట ఒక ఫోటోల ఆల్బం మరియు రీడర్సు డైజస్టు వారి అట్లాసు పడేసి వంటింట్లో కెళ్లి మా ఆవిడతో మంతనాలాడేను:-

"వీళ్లవరస చూస్తే భోజనానికి ఇక్కడే తిష్ఠవేసేటట్టుంది."

"ష్షు! మెల్లిగా మాట్లాడండీ! వాళ్లకి వినిపిస్తుందో యేమిటో?"

"మా ఇంట్లో భోజనం ఎంతమాత్రం వీలుపడదు- అని చెప్పేద్దునా, కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానుల్లాగ?"

"వ్వేవ్వే! మీ ఆలోచన అడివిలో కెళ్లినట్టే ఉంది. అలా ఎవరయినా చెప్తారటండీ. ఎలాగోలా ఇంత వుడకేస్తాను గానీ మీరు వాళ్ల మొహాన మరిన్ని పుస్తకాలు కొట్టండి."

"ఐతే ఓ పని చేస్తాను. నువ్వు అన్నం వండు. నేను ఐదునిమిషాల్లో దుర్గా భవన్‌కెళ్లి సాంబారూ, కూరలూ, పెరుగూ తెస్తాను. ఆవకాయ ఉండనే ఉంది కదా!"

"తెస్తే తెచ్చేరు గానీ, ఆ నాలుగు గిన్నెల కారేజి వాళ్ల మొహాలమీంచి ఆడించుకుంటూ మాత్రం వెళ్లకండి; అప్రదిష్టముచ్చట."

అప్పటికప్పుడు పక్కవాటా "ఒదినిగార్ని" మంచిచేసుకుని; అట్నుంచి, కాంపౌండు వాల్ సందులోంచి- దారి ఏర్పాటు చేసింది మా ఆవిడ.

హోటలు ముందర సైకిళ్లు పేర్చిన చోటికీ మెట్లకీ మధ్య సదుపాయంగా సెటిలైె కూర్చున్న "ఆస్థాన ముష్టివాడు" నన్ను చూడగానే లేచి నుంచున్నాడు. "దండాలు బాబయ్యా!" అని దండం పెట్టడానికి ఏమాత్రం ప్రయత్నం చెయ్యకుండా చిప్పమాత్రం ముందుకి జాపేడు. "ఉండరా, నీ సిగ తరగా! లోపలికెళ్లి రానీ!" అని తప్పుకోబోయేను.

వాడు నాకేరేజి వైపు వేలు చూపించి "సాంబారు మాత్తరం ఏయించుకోకండి బాబయ్యా. ఇక్కడెప్పుడూ బాగోదు. అందులోనూ ఇయాలైతే మా సెడ్డ దురువాసన గుంది..." అని వార్నింగిచ్చేడు.

ఆ హోటల్లో పదార్థాల రుచీ నాణ్యతా వాడికి తెలిసినంత బాగా మనకి తెలిసే అవకాశం లేదు. అంచేత కూరలూ పెరుగూ "రసం" (చారు అంటే నవ్వుతారని) వేయించుకున్నాను. సలహా

ఖరీదూ జాలి విలువా కలిపి; ఎందుకైనా మంచిదని రెండు పెట్టి భాగారించి; ఆ ఆస్థాన ముష్టివాడికి "పర్స్ ప్రెజెంటేషన్" చేసేను.

ఆ తరువాత ఒకనాడు ఆ హోటలు కెళ్లి పరధ్యానంగా ఇడ్లీ ఆర్డరిస్తే; సప్లయర్ చెట్నీతో బాటు తెచ్చిన సాంబారు రుచి చూసేక ఆ ముష్టివాడి రసజ్ఞత ఖాయం కాగా; ఆనాడు విత్‌హోల్డు చేసిన 50 శాతం గ్రాంటు వాడికి అందజేసేశాను.

★★★

"చెట్నీ చాలా బావుందోయి. థాంక్స్. ఏం అనుకోకపోతే ఇంకొంచెం తెచ్చిపెట్టు." అన్నాడు చక్రధరరావు, సప్లయర్‌తో.

ఆ సప్లయర్ కొరకొరా చూడ్డమే కాక; తెచ్చిన చెట్నీ మా మొహాల మీద పడేటంత విసురుగా వొడ్డించాడు.

"ఇప్పుడు నే నేమన్నాననీ; వాడికంత యిదీ?" అన్నాడు చక్రధరరావు. సాయంకాలం దాకా ఇద్దరం కలిసి తిరిగాం. చివరికి చక్రధరావుని నా స్కూటర్‌మీద వాళ్ళింటికి దిగబెట్టవలసి వచ్చింది. చక్రధరరావుని చూడగానే వాళ్లావిడ అతనికి దగ్గిరిసా వొచ్చింది. "ఏమిటది, నెత్తిమీద?" అని నేనక్కడ ఉన్నానన్న "ఇది" లేకుండా నిస్సంకోచంగా అతని జుట్టులోకి వేళ్లు పోనిచ్చి అక్కడ ఇంతసేపూ నాక్కనపడకుండాచిక్కుకున్న (గట్టిపడిన) చెట్నీని రెండు వేళ్లతో లాగింది. "అయ్యో, అయ్యో! ఇదెక్కడి విడ్డూరమండీ! హోటల్లో తింటే తిన్నారు గాని పచ్చడి నెత్తికి పట్టించుకుంటారా? వాడెవడో మాంసం తింటూనే ఉన్నాను కదా అని ఎముకలు మెళ్లో కట్టుకుని తిరిగేట్ట!"

చక్రధరరావుని వెనకేసుకుని రావడంలో హోటలుకి వెళ్లిన సంగతీ, చెట్నీ బావుందన్న మాట వంట వాడితో కాకుండా సప్లయర్‌తో చెప్పిన సంగతీ నేనే వివరించేను ఆవిడకి.

"ఈ నెప్పుడూ ఇంతే. మంచీ చెడ్డా; ఏమాట అయినా సరే; ఏది ఎవరికి చెప్పాలో వాళ్లకి చెప్పరు. పోస్టుమాన్ మనియార్డరు తెచ్చిస్తే అతనికి థాంక్స్ చెప్పకుండా ఆ మనియార్డరు పంపిన వాళ్లని పొగుడుతారు, అతన్ని అలా నుంచోపెట్టి. రంగనాథంగారు ఆయన రాసిన పుస్తకం ఓ కాపీ ఇచ్చిన వారంరోజుల తరువాత "నీ పుస్తకం బైండింగు చాలా బావుందోయి" అన్నారు. సారె గదిలో పెళ్లాన్ని మొదటి మాటుగా దగ్గిరకి తీసుకుంటూ 'ఈ చీరెంత బావుందో' అని మెచ్చుకునే రకం" అని నెత్తికొట్టుకుంది ఆవిడ. "ఛీ, నీకు సిగ్గులేదు....ఆ సీక్రెట్ ఇతని కెందుకు చెప్పేవు?" అని విసుక్కుంటూ లోపలికెళ్లిపోయాడు చక్రధరరావు.

★